





# బతుకాకు

సంటేడు గేమునాయుడు

వెలుగునీళ్ళతో మొహం కడుక్కుని చిరుగాలి తువ్వాలుతో ఒత్తు కుంటోంది అడవి. దూరంగా ఎత్తైన కొండ , ఆపదలకు చలించని అనుభవాలు పండిన పల్లెటూరిమనిషిలా నిశ్చలంగా వుంది. అతడి పెదాలమీద చెరగని నవ్వుల్లా పక్షుల కిలకిలలు. వేసవిని సూచిస్తూ అప్పటికే వేడెక్కిన ఉదయపు గాలి.. బరువు మోస్తున్నమనిషి ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లా... బరువుగా వీస్తోంది.

కొండ వెనక సూర్యుడు తునికాకు చిగురులా ఎర్రగా ఉన్నాడు. కిరణాల చూపులు పడి చెట్ల ఆకులు మిలమిల మెరుస్తున్నాయి. ఆ నునువెచ్చని అరుణకిరణాలలో తునికాకులు పొదలకు కాచిన రూపాయికాగితాల్లా రెపరెప లాడాయి. బాగా విప్పారిన రకరకాల పువ్వులు అడవి ముఖానికి నవ్వులు అద్దుతున్నాయి.

# జన్మదిన కథల పోటీలో ద్వితీయ బహుమతి రు. 3,000/- గెలుచుకున్న కథ



తుప్ప కొకరుగా చెదిరిన జనం తునికాకుతుంచి గోనె సంచుల్లో నింపుతున్నారు. ముసలాళ్ళు.... కుర్రాళ్లు,... ఆడవాళ్ళు... ఆకు తుంచడంలో మునిగి పోయి వున్నారు. ఒడిలో అకులు నిండేసరికి గోనె సంచుల్లోకి నింపుతున్నారు ఆడవాళ్ళు. ఒకరికొకరు సంబంధం లేనట్లు దూర దూరంగా అకులు ఏరుతున్నారు.

రాములు ఆ(త్రంగా ఏరుతున్నాడు, "తొందరగా సంచి నింపాలి" యిదీ అతడి ఆలోచన. తుప్పల్లో.. డొంకల్లో అటుయిటూ వెదుకుతూ తునికాకులు గుర్తుపట్టి చకచకా ఏరుతున్నారు. ఓ కుందేలు పిల్ల ఛెంగున దూకింది. అతని ముందు నుంచి. తుళ్ళిపడి చూసేడు. గుండెమీద తుప్ తుప్‌మని ఉమ్మి..." ఏంటో అనుకున్నానొసే... మా గనమైన సెవర పిల్లి..." అని అది దూకిన తుప్పవేపు పరుగు తీసేడు.

"ఒరే పులి బోజనమూ.. సెవర పిల్లులు తరవాత ఏటాడుదువునే.. ముందల ఆకు తెంపు. అందరూ ఎలిపోతే అప్పుడు మొ(్రోమంతావు ... ఒక్కడవు" కేకేసింది దగ్గర్లో అకులు ఏరుతున్న సింతల్లి.

రాములుకి మరోపేరు 'పులి భోజనం' రాములు వయసులో వున్నప్పుడు అద్దెకి బండి తోలేడు పట్నం. హోటలుకెళ్ళి "ఫుల్ భోజనం ఎంత " అని అడిగేడట. " అడిగినంత ఎడతారు" అని వాడు చేసే భోజనానికి అదిరి పోయిన హోటల్ (ప్రొప్రైటర్ " నాయనా నీది ఫుల్ భోజనం కాదు పులి భోజనమే" అన్నాడట. అప్పట్నుంచి రాములు పేరు 'పులి భోజనం ' అయిపోయింది.

సింతల్లి హెచ్చరికతో ఆకులు తుంచడంలో పడ్డాడు మళ్ళీ. ఎండ ముదురుతోంది. వేసవి ఎండ తీ(వత తెలుస్తోంది. రాములు చెమటలు కక్కుతున్నాడు. జుత్తులోంచి చెమట ధారలు కడుతూ కళ్లలోకి జారి కళ్ళు మండుతున్నాయి. కట్టుకున్న గావంచా మొత్తం చెమటతో తడిసి పోయింది.

చూట్టూ చూసేడు.కొంచెం దూరంలో సింతల్లి ఏరుతోంది. ' మిగతా వాళ్ళంతా ఎక్కడెక్కడ ఎరుతున్నారో'


పొద్దు నడినెత్తి కెక్కింది.

'అమ్మో నాయిన... సేన పొద్దెక్కింది. బేగెల్లప్పోతే బండి తప్పోతాది గావాల' అనుకుని తొందరగా ఆకులు ఏరడంలో పడిపోయాడు. మరి కొంచెం ఆకులు ఏరితే బస్తా నిండుతుంది. దగ్గర్లో గుబురుగా తుప్పలు. ఆ తుప్పల్లో చెయ్యెత్తు తునికాకు మొక్కలు. ఆశగా వెళ్ళేడు అటువేపు. కస్సున దిగబడింది అరికాలిలో తుమ్మముల్లు. నులకతాడు కట్టిన ఆకు చెప్పుల్లోంచి ముల్లులాగి గుచ్చిన చోట ఉమ్మి తడి పూసి ఆకుల కోసం చెయ్యి సాచేడు. పరింకంపలముళ్ళు.

చేతిని గీసుకుపోయేయి. ఆకులు చూస్తే పెద్దగా తళతళా మెరుస్తున్నాయి. ముళ్ళను లెక్కచెయ్యకుండా ... ఆకులు తుంచేడు. చెట్లమీదినుండి చీమలు ఒళ్లంతా రాలి ఒకటే మంట. ఎండ .. చెమట.. చీమల దురద... అయినా నిండిన గోనెసంచివేపు చూసి తృప్తిగా నిట్టూర్చేడు. తానిన్ని రోజులూ ఆకుల కోసం రానందుకు బాధ పడిపోయేడు. మొదట్లో అందరూ ఆకుల కెళ్తున్నారంటే అంతగా పట్టించుకోలేదు.

కోటిపాం కాడ బిర్జి పనుల కెలిపోతే రోజుకి యిరవై రూపాలు యిత్తన్నారు. ఆకుల కెల్లాలంతే.యీ సుట్టు పక్కల ధరిదాపుల్ల ఎక్కడా ఆకునేదు. అంతదూరం సార్జీలు కట్టుకొని ఆ ఒరిస్సా ఎలిపోయి నానా తిప్పలు పడి కొండెక్కి, బండెక్కి తేవాల. ఎందుకునే... పరిగెట్టి పాలు తాగడం కంటె నిలబడి నీలు తాగడం మంచిది' అని సరిపెట్టుకున్నా. 'ఐనా ఏటో జనం తీర్థం పెజ ఎ(రిబడి ఎలిపోత(న్ను వరసలుగట్టీసి ఆ సొమ్ము బంగారంగాను' అని.

మొదటిసారి ఆకుల కెళ్ళి వచ్చిన వాళ్ళు బస్తా ఆకులు డబ్భై రూపాయలకి తక్కువ కాకుండా వెళ్ళడంతో రాములుకి ఆశ పుట్టింది' మూడునాలుగు రోజులు ,బిర్జి పనులకెళ్తే గాని డబ్భై రావు. అలాటిది ఒకరోజు ఆకులకెళ్తే'? తండ్రీ కొడుకులుం



## ద్వితీయ బహుమతి రు.3,000/- పొందిన 'బతుకాకు' కథా రచయిత శ్రీ గంటేడ గౌరునాయుడు

విజయనగరం జిల్లా కొమరాడ మండలం నాగావళి తీరాన దళాయిపేటలో ముప్పైతొమ్మిదేళ్ల క్రితం తొలి వెలుగు చూశాను. సోములమ్మ, సత్యం నాయుడు మా అమ్మా, నాన్నలు. భార్య జానకి. క్రాంతి, కిరణ్ సంతానం. ప్రస్తుతం టిక్కబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తెలుగు మాస్టారుగా గిరిజన బాలల మధ్య జీవితం.

ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఆహ్వానం, రచన, కథావేదిక, వివిధ పత్రికలలో కథలు, కవితలు వచ్చాయి.

"వూని ఏడైనాను ఒకమేల్ కూర్చి జనులకు చూపవోయ్!" అన్న గురజాడ మాట నా ఆదర్శం.

నా చుట్టూ ఉన్న జీవితాన్ని రచనలలో ప్రతిబింబింపజేయా లనేది నా తపన. గురజాడ, గోపీచంద్, తిలక్, రా.వి. శాస్త్రి, కా.రా. మాస్టారు నా అభిమాన రచయితలు. శ్రీశ్రీ, తిలక్, వాడ్రేవు వీరభద్రుడు, ఆశారాజు నా అభిమాన కవులు. కన్యాశుల్కం, అనమర్థుని జీవయాత్ర, మహాప్రస్థానం, ఇల్లు - నాకు నచ్చిన పుస్తకాలు. నాకు స్ఫూర్తి నిచ్చే కథ కా.రా. గారు అద్భుతంగా మలచిన 'చావు' కథ.

ఇంతవరకు 'ఆంధ్రప్రభ'లో నా కథ ఏదీ రాలే దనుకున్న నాకు, మొదటగా అచ్చవుతున్న కథకే బహుమతి రావడం నా కెంతో ఆనందం!

'ప్రభ' వారికి నా కృతజ్ఞతలు.

గంటేడ గౌరునాయుడు, నాయుడు వీధి, కురుపాం - 532 524.

యిద్దరం ... నూటా యాభైకి తక్కువ వుండదు. ఈదెబ్బతోటి కరువు తీరిపోద్ది. డిపోలోన బియ్యం... పంచదార.. యిడిపించుకోవచ్చు. ఇన్నాలూ రేసను కార్డు సావుకారికిరెండో మూడో రూపాయలకి యిచ్చేసి మళ్ళీ ఆడి దగ్గిరే పావలాది.. రూపాయికి కొనవలిసి వచ్చేది. యిప్పుడలాగ యివ్వక్కర్లేదు. మా యిద్దరికీ గుడ్డముక్కలు తీసుకోవచ్చును. గుడ్డముక్క ఒక్కటేమిటి.అద్రుస్టం కలిసొత్తే తనకాపెట్టిన మడిసెక్క యిడిపించుకోవచ్చును. సిమ్మిడికి మంచి సంబంధం చూసి పెళ్ళి సేసే వచ్చును. సింతల్లి అప్పకూతురు సరసతోటి ముడేసిత్తే ఆడికిచ్చిన కట్నం తోటి జత ఎడ్లు కొనిత్తే హాయిగ యెవసాయం సెసుకోవచ్చు అనుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చేడు కొడుకు. ' యీడేడి.... ఎటుకాసి ఎరతన్నాడో' అని చుట్టూ చూసెడు. సింతల్లి కూడా కనిపించలేదు 'ఎంతదూరమెల్లిపోనారో' అనుకుని - ఈత రెమ్మనుంచిఆకులు తుంచి బస్తా మూతిని బిగించి మరోసారి చుట్టూ చూసేడు.

"సింతల్లో.." కేకే వేసేడు.

సమాధానం లేదు

" ఏమైపోయిందిది. యీదగ్గిట్లోనే వుండీది.... కొంపదీసి... ఏపురుగో.." అతనికి భయం లాంటిది కలిగింది. బస్తా భూజానికెతత్తుకుని వడివడిగా అడుగులు వేసేడు.

ఎండ తీవ్రంగా వుంది. దాహం అనిపిస్తే తనతోతెచ్చుకున్న ఒంటికప్పు నత్తు కేరేజిలోని నీళ్లు త్రాగేడు. కొంతదూరం వచ్చే గుబురుగా వున్న తుప్పల్లోంచి... మాటలు వినిపించి నట్టై అటు వెళ్ళేడు. అక్కడ ఓ విప్పచెట్టుకింది సింతల్లి .. ఎవర్నో తిడుతోంది. ఆశ్చర్యంగా చూసేడు. సింతల్లి ఎదురుగా ఖాకీ నిక్కరు చారల చొక్కా... మెడలో ఎర్ర తువ్వాలుతో కిళ్ళీ నములుతూ ... తెలీని ఒరియాలో ఏదో అంటున్నాడు. అతడి కళ్ళు టేకు చిగుళ్ళు నలిపిన చేతుల్లా ఎర్రగా వున్నాయి.

సింతల్లి పుష్టిగా వుంటుంది. చూడ్డానికీ బాగుంటుంది.

సింతల్లి ఒంటిమీద చెయ్యి వేసేడతడు. సింతల్లి విదిలించి కొట్టింది. అప్పుడు పిలిచేడు రాములు" సింతల్లో" అని సింతల్లి మీదికి వస్తున్నాడతను ఉలిక్కి పడి ఆగేడు. ముఖంలో భావాలు మార్చి ఒరియాలో ఏదో కేకలు వేసేడు ఆ అరుపులు అర్థం కాకపోయినా 'తిట్లు' లాంటివని మాత్రం తెలుస్తోంది. అతడి మాటల్లో దొర్లిన ఫారెస్టు ... గార్డు.... మాటలకు కొద్దిగా జంకేరు. వీళ్ళ జంకును గమనించిన వాడు మరింత రెచ్చి పోయాడు. ఆకుల బస్తామీద చెయ్యివేసి దించమన్నట్లు అరిచేడు.

రాములు సింతల్లి ఎప్పుడూ ఒరియా విని వున్నవారూ కాకపోవడంతో వాడి అర్థంకాని మాటల్ని ఒరియా అనే అనుకున్నారు. 'తమది తప్పని ..... తొలిసారి ఒదిలీమనీ' బ్రతిమాలేరు. బ్రతిమాలుతుంటే యింకా రెచ్చిపోయేడు వాడు. రాములుకి కోపం వచ్చింది. ' ఏటీడు బతిమాలుతుంటే మరీ గొప్పై పోతండు...కూతు కూతు అంటే మూతొట్టుకుంతండు' అనుకుని అటూ యిటూ చూసేడు. చూసి " ఒరే ఆడదాయి ఒంటిగుందని ఏసకాలేత్తన్నావేటి? ఎవడ్రా నువ్వు" అని భుజంమీద చెయ్యేసి నెట్టేడు. బక్కగా ఉన్నవాడు వెనక్కి తూలేడు. తూలినవాడు చివ్వున లేచి ఒరియా కాని ఒరియాలో తిడుతూ మీదికొస్తూ చేతిలోని గొడ్డలి ఎత్తేడు.

రాములు ఆగలేక పోయేడు. గొడ్డలి లాక్కుని విసిరేసి అతడి చేతులు పట్టుకుని అడివి తీగల్తో కాళ్ళూ చేతులూ కట్టి చెట్టు మొదట్లో పడవేసి " సింతల్లీ..పద" అని బస్తా భూజాని కెత్తుకుని కదిలేడు. నాలుగడుగులు వేసేక రాములు కొడుకు సిమ్మడు కలిసేడు.

ముగ్గురూ అడుగులు వేసేరువడి వడిగా. ఎండమండి పోతోంది. చెమటలు ధారలుగా కారుతోంది వాడిని కట్టి పడేసేడే గాని రాములుకి భయంగానే వుంది. ' బిరాల రోడ్డెక్కిపోతే ... లారీ లోనో .. బస్సులోనో ఎలిపోవచ్చును' అనుకున్నాడు. కడుపులో ఆకలికరకరలాడుతోంది. తొందరగా నడుస్తున్న ముగ్గరూ ఠక్కున ఆగేరు.

ఓ పదిహేనుమంది ... అందరూ తమ వూరివాళ్లే.. బరువులు దించి మూకగా ఉన్నారు. మధ్యలో సీతయ్య పోలమ్మకాలికికట్టుకడుతున్నాడు. ఆత్రంగా అడిగేడు రాములు.

"ఔన్రా సీతన్నా... ఏటయ్యిందిరా"

"ఆకులేరిన సందడిలోన సూసుకోలేదట.. అదే పామో మరి.." అని చెప్పి ఆకులేవో పిండి పసరు వేసి పాము కాటేసిన చోట కట్టుకట్టేడు.

"అది యిసప్పురుగు కాదులే.. నాగుబామైతే యిపాటికి సొంగలు కక్కుకొని సచ్చిపోదూ... పరవానేదు.. ఇంటికెల్లగాన గున్నయ్యన్నకి సెప్తే మందిత్తాడు." ధైర్యం చెప్పే డొకడు. ఆ మాటతో అందరూ కొద్దిగా తేలిక పడ్డ మనసుతో బయలు దేరారు. పోలమ్మ బస్తా ఆకు నలుగురూ నాలుగు బస్తాలకు సర్దేరు. రోడ్డును చేరుకునే సరికి లారీ ఒకటి వచ్చింది. 'యింక భయం లేదు' అన్నట్టు హాయిగా ఊపిరి పీల్చేడు రాములు.

"ముండగండడు పళ్ళూడ బొడిసిద్దును. కాలిన పిడక ముక్కనాగ ముకమెట్టుకోని' దారవాత ఏటేటో పేల్తండు బాసల... అక్క డ ఆకులు ఏరకూడదని అదొక బితుకు. నేపోతే ఆడినడుం యిరగ్గొట్టిద్దును. అప్పుడు లోన వచ్చినాడు పులిభోజనం... ఆడికి మంచి పని సేసినాడ్నే" చెప్పుకుపోతోంది సింతల్లి.

పోన్నె... యిళగెక్కడ అనకు అదోక బాద ... పల్లకో.." వారించేడు రాములు.

పాము కాటుకు నొప్పి ఎక్కవై మూలుగుతోంది పోలమ్మ

"తుమ్ము తమ్ముడై సెప్తాదంతారు. నానప్పుడే అనుకున్నాను. యిలాగ కేరేజీ పట్టుకోని గడపదిగిందో నేదో ఎవులో తుమ్మినారు. నాను సెప్తే యింతారేటి" ఓ ముసలాడు గొణుక్కున్నాడు

లారీ కోటిపాం బ్రిడ్జి దగ్గరకొచ్చేసరికి పొద్దు వాలిపోతోంది. 'ఇక వూరెలిపోయినట్టగే'అనుకుని దిగేరు.

* * *

చిన్న కిరసనాయిలు బుడ్డీ వెలిగించి ఆ గుడ్డి వెలుగు లో రాత్రి మేలుకుని ఆకులు కట్టలు కట్టేరు. మరునాడు తునికాకు కళ్ళానికి పట్టుకెళ్ళారు.

కట్టలు ఆరవేసిన కళ్ళం.... చెమట ఆరి ఉప్పు పేలిన కష్టజీవి వీపులా వుంది. కళ్ళంలో ఓ మూల నిలవేసిన ఆకులు బస్తాలు. .. ఒకచోట పేరుకు పోయిన నంవదల్లా వున్నాయి.

కాంట్రాక్టరు గుమస్తాలు కట్టల నాణ్యత చూసి లెక్కవేసి చీటీల్లో రాస్తున్నారు. నూటా యిరవై కట్టలయితే నూరుకట్టలనీ నూటడెబ్బై అయితే నూట యాభయ్యని ... కొతపెట్టి చీటీల్లో రాస్తున్నారు.. 'ఇదేమిటి'అని ఎవరూ అడగలేదు. సిమ్మడికి యిదంతా అయోమయంగా తోచింది. అడక్కుండా ఉండలేకపోయాడు. అదే అన్నాడు.

" ఇదేటిలగ... నావి నూటపాతిక కట్టలెతే నూరు రాసినారేటి... మా అయ్యవి నూటపదిహేను. అడికి నూరే రాసినారు. మాకేటి అంకిలు తెలివనుకుంతన్నారేటి... మిగిలించిన కట్టలు మీ యదాన పడేసుకోడానికా."

ఈ మాటలకి గుమాస్తా సర్రున లేచేడు.

"ఎక్స్ట్రా రూల్సు తీస్తున్నావు. నీకు అంకిలు తెలునని మాకు తెలుసున్లే. అచ్చర విజయం లోన సదివేసినావుగావాల సదువు... యీ లందరూ అడగలేక అనుకుంతన్నావేటి? సిరిగి పోయినవి సిత్త బట్టినవీ.. ఆకులు లోపల కట్టిసి పట్టుకొత్తేపూరాగ యిచ్చేతారేటి..ఎల్లెల్లు.." సిమ్మడిని కసిరేడు.

"సిరిగి పోయినవి ...సిత్త బట్టినవీ... కట్టలు కట్టడానికి మీ కళ్ళు గప్పేసిన పని మామేటి సేసేనేదు. కట్టలు సూసుకో అలాటి వేవేనావుంటే అప్పుడడుగు, అంతేగాని కట్టలు తగ్గించితే సల్లకోను."

"ఒరే నువ్వు కట్టలు తేవక్కర్లేదు. మాకు కొనక్కర్లేదు. ఎల్లు నీ ఆకులు పట్టికెలిపో " విసురుగా సిమ్మడి బస్తాను బయటికి నెట్టేడు గుమస్తా.


## ఊర్ధ్వబాల మధ్యాహ్నమ్

వరమార్థాల కోసం గవేషిస్తూ
ఆశ్రయించాను వదాలను -
దారి దొరకనీయక మౌనం వహించాయి కొన్ని
ఉత్తశాబ్దిక వటాటోపంతో మ్రోగుతూ కొన్ని
నిశ్శబ్దాన్ని వటావంచలు చేయలేక
నీరుకారిపోయాయి కొన్ని ...

నాకు దొరకలేదు వథమూ, తరుణోపాయమూ
కాలం లూతగా అనంఖ్యాక పాదాలతో సాగి
అల్లుతోంది నా చుట్టూ బూజు గూళ్లు
న న్నావరించింది అవస్మారం వంటి రుజ
నారక ఘంటికల అనారత నాదం
ప్రతిధ్వనిస్తూ సాగరం, మాయావాగురం;
మెల్లమెల్లగా న న్నాక్రమించచూచే నముద్రం
మౌనముద్ర దాల్చి నా ప్రక్కనే కూర్చుంది మెల్లగా వచ్చి;

నంకుల నీహారాటవుల ముంచుతూ జల నిధులు
వరమార్థాలను మాత్రం మాయం చేశాయి.
ఛటిల్లు మంటూ తుఫాను గాలులు నిర్దయగా
నుందర తీరాల సీమాతిక్రమణల కోసం నిర్భయంగా ...
ఘోరాటవి వరిత్యక్తంగా
వరిదేవనాభివ్యక్తంగా
బాధామయ భావనా వరిశిష్టంగా
ప్రాకుతూ నైరాశ్యం వివప్రయోగమై!

ఘీంగమూస్తూ దుష్పథ మాయామకరాలు
వరమార్థాలు చేరువయ్యే దారులన్నీ మూస్తూ
గర్జిస్తూ వదాలు నంకుల ధ్వాంతాటవులై
కుయ్యాలించే దిక్కే కానరాదా? ఏది దారి?



డా. సోమనుందర్

సిమ్మడికి చిర్రెత్తుకొచ్చింది.

పెల్లిసేసినోలకంట పెట్టిలు మోసినోల్తే పెద్దరికమ... నీవెందుకలగై పోతున్నావు. నాకు తేవద్దండాకి నువ్వెవులు. సర్నే అలాగే సూత్తంగాని.." అని అక్కడున్న అందర్నీ పిలిచి 'ఒరే మనమెవులమూ ఆకులివ్వద్దురా" అని చెప్పేడు.

" అల్తోటి నీకేల పల్లకోరా - అందరికీ లేని నీకేల" వారించేరు అందరూ. అప్పుడొచ్చేరు ఎవరో యిద్దరు కుర్రాళ్ళు. వాళ్ళ చెతుల్లో కరపత్రాలున్నాయి. అందర్నీ నవ్వుతూ పలకరించి కష్టసుకాలు అడిగేరు. అందరికీ కరపత్రాలు పంచి వారిని ఉద్దేశించి మాట్లాడేరు.

" ఎంతో కష్టపడి తునికాకు సేకరించి తెస్తున్నారు. మీ శ్రమకు తగిన ఫలితం అందడం లేదు. ఇకనుంచి కట్ట ముప్పై ఐదు పైసలనుండి యాభైకి పెంచమని తునికాకు కాంట్రాక్టర్లకితెలియ జేసేము. అలా యివ్వనప్పుడు మీరు ఆకులు తీసుకు రావద్దు. మేరంగి సెంటర్లో సాయంత్రం మీటింగుంది. అక్కడ వివరంగా చెప్తాము రండి."

ఆమాటలు సిమ్మడు పొంగి పోయేడు. కట్టలో కోత మాట చెప్పేడు.

" మీ పని కట్టలు లెక్కగట్టి సరుకు తీసుకోవడమే. మీ పని మీరు చెయ్యండి. సరుకు తేవద్దని అనడానికి మీరెవరు? యిదుగో ... వీళ్ళు సరుకు తెస్తేనే మీకీ గుమాస్తాపని నిలబడేది. మీ కాంట్రాక్టరుకు లాభాలు వచ్చేది. మీ బ్రతుకులకి ఆధారం. వీళ్లు... వీళ్ళ శ్రమ.. ఏదీ మీ కాంట్రాక్టర్తో మాట్లాడుతాం... పిలవండి."

కుర్రాళ్ళ మాటలతో గుమాస్తాలు జంకేరు.

కాంట్రాక్టర్‌కి యీ విషయం తెలిస్తే మొదటికే మోసం వస్తుందని ఆ కుర్రాళ్ళని బ్రతిమాలేరు. సిమ్మడికి ఆనందంగా వుంది. " బాగా అడిగేరు. సాయంత్రం మీటింగుకి వత్తాంనో" అని ఆనందంగా చెప్పేరు.

"ఇది బాగుంది" అన్నారు చాలామంది

"పోనీ ఒక్కరోజు లేటైపోయింది. సాయంత్రం మీటింగుకి ఎల్దాం గాని అక్కడ ఏటి సెప్తారో యింతే తప్పేటి? కట్ట అర్ధరూపాయి సెత్తే మనకేటిగావాల" అన్నారు కొందరు.

రాములుకి యిది నచ్చ లేదు.

"శివామని తెచ్చినాను అకు... ఏటిప్పుడు నష్టమొచ్చింది. రేటుపెంచమంతారు!" అన్నాడు కొడుకుతో. చేతిలో పడవలసిన సొమ్ము ఆలస్యమైపోతోంది అదీ అతడి బాధ.

"ఒరే వల్లకోరయ్య అలు సెప్పింది మనకోసం కాదేటి... యీ అగ్గి కర్తలు ఎండల్ల నానాబాధలు పడి ఆకులు తెత్తే ఆ కాంట్రాటు బావులు లాభాల మీద లాభాలు గడించుతారు. ఆ లేటి ఒట్టి పున్నానికి యిచ్చెత్తన్నారా. అందులోన కట్టలోన 'కోత' ఒకటి... ఎవులు కరుపులు కొట్టడానికి?

కొడుకు మాటలకి అర్ధం వచ్చేరు రాములు.


" అవునా... ఆ కాంట్రాటుబావెంత మదుపు పెడతండో అంతా రావాలా నేదా ? గుమాస్తాలు జీతాలు, జీపి కరుసులు.. ఆకుల కట్టలు ఎండలో పెట్టి అటిని సంగరించనోలకి... యివన్నీ పోగా గాలివానవత్తే ఆ కాంట్రాటు బావు బుర్రమీద కొంగేసుకుని ఎలిపోవడమే. మనమూ కసింత ఆలోసించాల.' ఎక్కిన కొమ్మ నరుక్కుందటే ఎలాగ..."

" మన కష్టానికి తగినట్టగ అడుగుతున్నాంగానీ ఆడిసొమ్ము మనకి దారపోసిమంతన్నామా... అడికెంత నాబం వత్తందో మనమడిగినామా... సొలు ఒలికి పోయినోడు ఏడిత్తే కొబ్బరికాయలు ఒలికి పోయినోడూ ఏడిసినాడట. అలగుందిరా నువ్వన్నది. అలకి నువ్వు తందాన పాడతావేటి? సర్లే నువ్వు రావద్దునే నానెల్తాను మీటింగుకు" అని సిమ్మడు మీటింగికి వెళ్లారు. ర్యాలీలో తిరిగేరు.

నాలుగు రోజుల వరకూ కాంట్రాక్టరు దిగిరాలేదు

చాలమంది రాబడి ఆగిపోయినట్టు దీనికి కారణమైన వాళ్లని తిట్టేరు. ఐదో రోజున కాంట్రాక్టరు 'ఆఫీసు తెరిచేడు. కట్టల్లో కోత లేకుండా... కట్ట యాభై పైసలు యివ్వడానికి అంగీకరించాడు అందరూ ఉత్సాహంగా బయలు దేరేరుమళ్లీ.

"ఒరయ్యా... అలగన్నావ్... యిప్పుడు సూడు రేటు పెంచినాడు. కట్ట అర్ధరూపాయి అయ్యింది. ఎన్ని కట్టలు పట్టొకెల్తే అన్నిటికి సిటి రాయాల.




అంతేన్రా నిలదీసి అడగపోతే నాయం జరగదిరోజుల్ల..." సిమ్మడు హుషారుగా వున్నాడు.

"ఐతే... యిప్పుడు ఆకొక పైసపడిందని మాట" రాములుకి ఆనందంగా వుంది.

"మరోలైతే. అందుకే సంగంలో సేరాల. సంగం సెప్పినట్టుగ నడాల..." అన్నాడు సిమ్మడు తనకు ఎంతో తెలిసి పోయినట్టు

కొడుకు వేపు గర్వంగా చూసేడు రాములు.

'ఇంటిల... ఆడదిక్కు నేదు. యీఏడు సిమ్మడికి పెల్లిసేసియ్యాల' అని మరోసారి అనుకున్నాడు. 'నెలరోజుల దాకా మూర్తాలున్నాయట సింతల్లి అప్ప కూతురు సరస మా సక్కగుంతాది.మంచి పనిమంతురాలు... సిమ్మడికీ దానికీ'యీడూ జోడూ' బాగుంతాది. కోడల్దాయివత్తే సెయ్యి కాల్సుకోడమూ తప్పుద్ది కూలికి నాలికి ఎల్తాది."

తన ఉద్దేశం చెప్పేడుసింతల్లితో... సింతల్లిమంచిదే అంది సిమ్మడికి చెప్తే వాడు సిగ్గు పడిపోయేడు. మిట్ట మధ్యాహ్నపు ఎండ వాడికేమీ అనిపించలేదు. ప్రక్కనున్న మామిడి కొమ్మమీంచి కూసే కోయిల పాట ఎంతోమధురంగా వినిపించింది వాడికి.

తునికాకు ఏరుతున్నాడే గాని ఆకు ఆకునా లేత తునికాకు రంగులో సరస ముఖం కనిపించి కవ్విస్తుంటే ఆ ఆలోచనల్లో మునిగి పోతున్నాడు.

ఒంటిఘటం పండక్కి వచ్చిందా అమ్మాయి. ఘటాల వెనక తిరుగుతున్నపుడు డప్పు... తుడుము దరువులకి తను నిలవలేక గంతులేస్తే " సిరంజీవి లాగ డాన్సాడేవు' అని సరస మెచ్చుకుంటే తనెంత పొంగి పోయేడు." నాను సిరంజీవి నైతే నువ్వు విజయశాంతివా..." అని తనంటే సిగ్గుతో ముఖం కప్పుకుని తుర్రుమంది తన మనసు గాల్లో తేలిపోయింది. "అయ్యకెలాగ తెలిసి పోయిందినా మనసు" అని తెగ మెచ్చుకున్నాడు తండ్రిని.

'ఆకుల మీద బాగ సంపాదించాల సరసని పార్తీపురం తీసికెల్లి చలకన్ను టిక్కటు తీసి సినిమా సూపించాల' యిలా ఎన్నెన్నో ఉహాలు. ఆ వూహల్లో ఎండ వెన్నెలగా మారి పోయింది. హుషారుగా ఆకులు ఏరేడు. ఈ సారి వాడు రెండు గోనె సంచులూ కావిడీ తెచ్చేడు.

రెండు సంచుల నిండా ఏరితే సంచికి .యాభై పుంజీల కట్టలు ఆ లెక్కన రెండు సంచులకీ వంద పుంజీలు అంతే రెండొందలు అని లెక్కవేసి... నాలుగువేలు కూడ బెట్టడం ఎంత పనీ..' అనుకున్నాడు.

"ఔన్రా సిమ్మడో... నీ ఆశ అగ్గిలబెట్టి తగలెయ్య . రెండు గోనిసంచులు పట్టుకొచ్చినావు. నీ గుంతుక్కి ముడినేదెటి'పికసన్నము... ఆకలెక్కువా' అని సంచులు ఎప్పుడికి నింపుతావురా.."

సింతల్లి మాటల్ని తేలిగ్గా తీసిపారేస్తూ అన్నాడు సిమ్మడు.." ఏంచేప్పు.. యిదా అయిపోయిందిగాదీ... సంపాదించపోతే మీ అమ్మిని పెంచడమెలాగ సెప్మీ."

అందరూ మూటలు ఎత్తుకుని బయలు దేరే సమయానికి వచ్చేరు యిద్దరు ఫారెస్టు గార్డులమంటూ. ఇద్దరూ మందు మీదే వున్నారు. సింతల్లి చూసింది. వాళ్లలో ఒకడు 'మొన్నటోడే' అనుకుంది. రాములూ చూసేడు ' ఆడే' అనుకున్నాడు. యీ పట్టునదొరికితే వాడు వదల్డు అనుకుని పరుగు తీసేడు. రాములు వెనక అంతా పరుగెత్తేరు. బరువుతో పరుగెత్తడం కష్టంగా వుంది వాళ్లకి. ఆ వచ్చిన వాళ్ళు వీళ్ల పరుగందుకోలేక అలిసిపోతూ.. తూలిపోతూ... కోపంతో చేతికందిన రాళ్ళతో విసిరి కొట్టేరు. వెనకబడ్డ సింతల్లి కాళ్లకు ఓ రాయి తగిలి ముందుకు పడిపోయింది. సిమ్మడు చెయ్యివూత అందించి

సాయం చేసేడు.

కొందరికి రాళ్ళు తగిలేయి. అయినా ఎవరూ ఆగలేదు. ఆకుల కోసం ఆశతో అడివిలో చాలా దూరం వచ్చేసేరు. గార్డుల్ని తప్పించేడు రాములు.

ఎండ కలవారి కోపపు చూపులా వుంది

కాలుతున్న నేల పేదవాడి ఆకలి కడుపులా వుంది.

రాములు చెప్పుకు కట్టిన తాడు తెగిపోయింది. కాళ్ళు కాలిపోతున్నాయి. సింతల్లి కాలికి తగిలిన దెబ్బతో నడవలేక పోతోంది. ప్రాణాలు తోడేస్తున్నాయి. ఎండకు తట్టుకోలేక పోతున్నారు.

"ఏటీ ఎండలు.. అగ్నికర్తిలు గావాల. అగ్గినిప్పులు సేటల్తో సెరిగినట్టగింది." రాములు జాపోసి పోతున్నాడు.

"ఎవకల తాగిన దప్పికి పేగులు తిరగబడి పోతన్నాయి." ఆకలికి చుట్టుకుపోతూ ... బాధగా అన్నాడో కుర్రాడు

"డబ్బులైతే వత్తాయి గాని ఈ బాద బగమంతుడి కెరిక." బస్తాదించి దానిమీద కూర్చుండి పోయేడు ఒకడు.

అందరూ బరువులు దించేరు.

విశాలమైన మెరక నీడ నిచ్చే చెట్టు ఎక్కడా కనిపించలేదు. అన్ని బలుసు తుప్పలు. వాకాయ తుప్ప.

ఎర్రెర్రగా చిగురులేస్తున్న తునికాకు తుప్పలు ఆ ఎండలో అగ్నిపూలులాగా కనిపిస్తున్నాయి.

"పొగులల్ల ఎండలబడి ఆకలి తోటి ఆకులేరడం ... రాత్రి తెల్లార్లూ ...ప్పలు పడకుంట ఆకులు కట్టలు కట్టడం, పేనానికి సుకంనేదు. ఇంటిలనలుగురు మనుషులుంతే గాని యీ పని సెయ్యడమూ కట్టమే.".

సింతల్లికి శోషవచ్చినట్లరది.

" అవ్వురా పులిభోజనమన్నా. నీలుమిగిల్నాయేటి" అడిగింది సింతల్లి తనకేరేజి కప్పులో నీళ్ళు లేకపోవడంతో. రాములు తన కేరేజీ కప్పులో మిగిలిన కొద్దినీటిని సింతల్లికి యచ్చేడు.

"పేనంనిలబెట్టినావురానాయినా.." అని లేచింది.


మళ్ళీ బరువులు తలకెత్తేరు. పరుగులాంటినడక, నేలలోంచి ఆవిర్లు లేస్తున్న ఎండ. రాములు పాదాలు బొబ్బలెక్కాయి. సిమ్మడు కావిడి దించి తెగిపోయిన తండ్రి చెప్పులకి ఈత ఆకులతో ముడి వేసేడు. అదీ కొంతసేపే మళ్ళీ తెగిపోయేయి. సిమ్మడు తన చెప్పులు తండ్రికి యిచ్చేడు. అందరూ వయసు బిగువున ఎండకు ఓర్చుకుంటున్నా రాములు మాత్రం డీలా పడిపోయేడు. బస్తా బరువు ఇంకా ఎక్కువైపోతున్నట్టనిపించింది. గొంతు కెండి నాలుక పిడచగట్టుక పోతోంది.

" ఔరా బావ్... ఎవ్వలి దగ్గరైనా నీలున్నాయిరా?" నడవలేక పోతున్నాడు రాములు. ఎవరి కేరేజీల్లోనూ నీళ్లు మిగలలేదు.

"నువ్వ్వ చేసినావురా దారి తప్పించేసినావు. నేపోతే యిపాటికి రోడ్డు కెలిపోదుము." అన్నాడొకడు చిరాగ్గా

" రోడ్డుకెలిపోదుమో.. ఆగార్డుకి దొరికి పోదుమో ఎవుడికి తెలుసు." రాములుకి నీర్సంతో యింకాఎక్కువైంది చిరాకు. భరించలేనంత దాహంగా వుంది లోపలికి లాగేస్తున్నట్టుంది నాలుక

"ఒరే సిమ్మడూ.....సింతల్లే... మరి నాను అడుగుతీసి అడుగెయ్యనేను.యీ వలి నీలు..... నీలు కావాల..." రాములు కూర్చుండి పోయేడు. అతని నోట మాట రావడం కూడా కష్టంగా వుంది. అందరూ బరువులు దించేరు. సిమ్మడికి ఏడుపొచ్చింది అయ్యని చూస్తే.



"ఒరే బావ్ యీవలి సచ్చిపోతాన్రో.. మరి బతకను" రాములు నేరావలించి బస్తాకి చేరబడి పోయేడు. ఒకడు బస్తాల్ని రెండు వరుసలుగా పేర్చి అందులోకి'గాలివాన తుప్పులు'.... ఆకులు వేసి గూడులా చేసేడు. రాముల్ని అందులోకి చేర్చేరు. యీ వలి నీళ్ళు అంటూ కళ్ళు తేలవేస్తున్నాడు రాములు. అందరూ రాములు వేపు జాలిగా చూడ్డం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నారు.

"ఒరే బావ్ . ఎవులో ఒకలు కేరేజీలో 'నీరుడైనా' పోసి యివ్వండ్రా నేపోతే సచ్చిపోతాన్రా నాయినా... ఎందిరలాగ సూత్తారు. పేనం నిలబెట్టిందేమందురా. ఒరే సిమ్మడూ నేరాబేగిసిన్నప్పుడు నిన్నెత్తుకుంటే నానోట్లో పోసేసినావు.. అప్పుడది సరదా... మరిప్పుడుఅదే పేనం నిలబెడతాదేటో" దీనంగా అడుగుతున్నాడు రాములు.

"పల్లకోరా... నువ్వు మాట్లాడకు అసలే గొంతుకెండిపోయింది" కసిరేరు అందరూ. సిమ్మడు భోరున ఏడ్చేడు. ఎవరికి 'నీరుడి' పట్టి నోట్లోపోయటానికి మనస్కరించలేదు. రాములు అదే పనిగా అడుగుతున్నాడు. 'ఏటోఒకటి సెయ్యండ్రా... నాపేనం నిలబెట్టండ్రా" అని.

సిమ్మడు కేరేజీపట్టుకుని తుప్పల చాటుకెళ్లేడు తెగించి. నిరాశగా తిరిగొచ్చేడు... నీళ్లు నిండిన కళ్ళతో అందరికీ చికాగ్గా వుంది.

"లోపలి నీరంతా ... సెవలై కారిపోతే యింక నీరుడెలాగొత్తాది"

"రాములు మూలుగుతున్నాడు. సింతల్లి ఎయ్యాడ కొంగుతో విసురుతోంది. వేడిగాలి చెంపల్ని మాడ్చేస్తోంది. చుట్టూ చూసేడు సిమ్మడు. పిట్టకూడా ఎగిరే జాడలేదు. వాడికి ఏడుపు ఉబికుబికి వస్తోంది.

దూరంగా ఓ చిన్న మామిడి గున్న కనిపించినట్టై ంది.

వాడిలో చిన్న ఆశ. ఉత్సాహం పుంజుకుని పరుగుతీసేడు. రాములు పరిస్థితికి భయంగా ఉంది అందరికి

సిమ్మడు మామిడి చెట్టు దగ్గరికెళ్లేడు. కొమ్మల్లో అక్కడక్కడా కాయలు కనిపించేయి. ఆత్రంగా కాయలు తెంపేడు. పరుగు పరుగున కాయలు రాతిమీద కొట్టి రసం తండ్రి నోట్లోపిండేడు. పుల్లని మామిడి కాయ రసం తగిలి తెప్పరిల్లేడు రాములు ప్రాణం లేచొచ్చి నట్టైంది.

అందరూ మామిడి కాయని కొరికేరు

పళ్ళు పలిసినట్లు మామిడి ముక్కల్ని కొరుకుతూ బరువులు ఎత్తుకున్నారు మళ్లీ

కూ.....క్

అల్లంత దూరంలోకూతపెడుతూ రైలు..

"ఒరే... పరిగెట్టండ్రా... పరిగెట్టండి అదా ... ఎలిపోత్తంది బండి యీ బండి తప్పితే మనమీరాత్రి యిక్కడ తొంగోవలసిందే రేపు అంబలేలకి ఆకు అందివ్వకపోతే మరి తీసుకోడు కంట్రాటరు. పదండి."

"యీ ఊసిన్ల సిటమైనా ఆగదు బండి. బేగి రండ్రా.."

తలల మీద బస్తాల బరువులతో వరుసలు వరుసలుగా జనం ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ పరుగులు పెడుతూ స్టేషన్ చేరేరు.

మరోసారి కూతవేసింది రైలు.
పచ్చజండా వూగింది. బండి కదిలింది.

జనం గోల. బరువులు బండిలోకి వేస్తూ... బండెక్కుతూ

కొందరు కదులుతున్న బండిలోకి పెరిగెత్తుతూ ఎక్కుతున్నారు.

కావిడిలోని బస్తాలు తీసి బండిలోకి విసిరేడు సిమ్మడు. బండివేగం హెచ్చింది. బండెక్కుతున్న సిమ్మడికాలు జారింది సిమ్మడు కిందికి జారి పట్టాల ప్రక్కన రాళ్ల మీదికి దొర్లేడు.

"ఒర్నాయనో... ఒరే కొడుకా... సిమ్మడో-" రాములు ఏడుస్తూ దూకబోయేడు బండిలోంచి సింతల్లి పట్టుకుని ఆపింది

కొంతదూరం ముందుకెళ్ళి ఆగింది బండి.

సిమ్మడి ఒళ్లంతా రక్తం

పెట్టెనుండి జారిపోయిన బస్తాచిరిగి ఆకులు పట్టాల పక్కన ఒత్తుగా పరుచుకున్నాయి. ఆ తునికాకు మీద నెత్తురోడుతూ సిమ్మడు.

పచ్చని ఆకులు సిమ్మడి రక్తంతో తడిసి ఎరుపెక్కి ఎర్రని ఎండలో మరింత ఎర్రగా మెరిసేయి.

రాములు పరుగున వచ్చి కొడుకును పట్టుకుని భోరున ఏడ్చేడు.

"అదృష్ట మంతుడు పట్టాల పక్కన పడ్డాడు. బండెక్కించి పార్వతీపురం ఆసపత్రికి తీసకెలిపొండి"

## ఈ గడ్డ మహాత్మ్యం!



మెక్కా కొందరికి పవిత్ర స్థలం
మరికొందరికి జెరుసలెమ్
మరి నాకో సర్వ భారతం!

అదేమి సుకృతమో కాని
నా దేశంలో ప్రతి ఊరు
ఏదో ఒక విధంగా పవిత్రమే!

కంచి కెంత చరిత్ర కలదో
కాశీ రామేశ్వరాలకూ అంతే
గయ మాత్రం తక్కువదా!

పురములేనా పవిత్రమైనవి!
గిరులూ తరులూ సరస్సులు
సరిత్తులూ పరమ పవిత్రాలే!

ఈశ్వరాంశ లేని జీవి
ఇలలో కనిపించనట్లే
ఈ గడ్డ ఈశ్వరమయం!

ఈ ఊరు ఆ ఊరని కాదు
ఏ ఊరు తిలకించినా
దేవుని ఆవాసమన్న
పవిత్ర భావం స్ఫురిస్తుంది
భారతదేశం పరికిస్తే!

దేశమే బృహదాలయమైతే
దేవు డిక్కడే ఉన్నాడని
ఆ వైపే నెలకొన్నాడని
భావించడం వెర్రి కాదా!

నా దేశంలో ప్రతిచోటూ
దివ్య ధామమై కనిపిస్తుంటే
నా స్వామికి లేని భేద భావం
నాకు కలగడం వెర్రి కాదా!

చల్లా రాధాకృష్ణ శర్మ

ఎవరో సలహా యిచ్చేరు.

"ఎవులు ముకం సూసి బైలెల్నామో అన్నీ బాధలే!!

"ముంద్రాల అకు ముష్టి డబ్బులు..... యిలాగ సచ్చి పోతుంద్రు జనం...."

"ఆకులు తప్పేటి.... ఆకల్దిగాని... యిత్తానంతే ఆశ... కొడతానంతే బయం. కడుపు మంట సల్లారడాకి ఏదో ఒకటి సెయ్యాల. యిలగౌతాదని ఓవులు కలగంతారు..."

"వస్తున్న నెల్లోన యీడికి పెల్లిసేసిద్దమను కున్నాను యీడి కర్మ యిలగ కాలిపోయింది."

అందరూ కల్సి సిమ్మని బండెక్కించేరు.

రాములు ఏడుస్తూ బండెక్కాడు.

* * *

ములక మంచంలో నిస్త్రాణగా పడివున్నాడు సిమ్మడు. సరస వాడి ప్రక్కన కూర్చుని మందు తాగిస్తోంది. రాములు గోనెసంచి చంకన పెట్టుకుని సరస పక్కకొచ్చి అన్నాడు.

"అమ్మో సరసా... జాగ్రత్త.... నాను ఆకుల కెల్లి వత్తాను. అకుల సొమ్మంతా ఆసపత్రి కరుసుల కింద అరాయించుకు పొయింది. అకులు మరి తీసుకోరట. రేపే. ఆకరట. ఎల్లొత్తాను. వందో యాబయ్యో వత్తే మందులకుపనికి రావా...."

[వచ్చేవారం: ద్వితీయ బహుమతి గెలుచుకున్న కథ: 'పాము' - జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం]

"అ మల్లీ ఎల్తన్నావా ఆకులికి?!"సందేహంగా అడిగింది సరస. రాములు సరస వేపు చూసి వేదాంతిలా నవ్వి చెప్పేడు

" అమ్మో పెమాదాలు మనకి కొత్తేటి! మా అయ్య పాలేరు గా వుంతప్పుడు బుగతోరి పొలానికి నీరు కట్టడానికి ఎల్లెడు ఎవకుల నెగిసి; ఎలుగుబంటి కొట్టీసింది.. అలగని పాలేరు సెయ్యడం మానీసి నాడా? మా యత్త పొయ్యిలోకి కంపలేరడాకెల్లి పురుగు ముట్టి మంచం పట్టీసింది. అలగని కంపలకెల్లడం మానీసినామా? బీర్టీపని కెల్లి రైలు కమ్ము తెత్తుతుండగా నా కాలు మీద పడిపోయింది. నాల్రోజులు తొంగోని మల్లీ పనికెల్లనేదా? మాసిగురోడు కన్నడేటైనాడు... ముసురు బెట్టి వర్సం దారగట్టితే బక్కలిప్పడానికెల్లి పిడుగుబడి సచ్చిపోనాడు. అలగని వానలో కెల్లడం మానీగలమా...ప్చ యిన్నెందుకు ... వున్నట్టుండి యీ పాక తిరగబడిపోతే మనమేటి సెయ్యగలం సెప్మీ... మనకరమ్మెలాగుంటే అలగ జరుగుతాది. మన పని మనం సేసికెలిపోవడమే...

"పేదోడి బతుకే పెమాదం. పెమాదాల కి జడిత్తే సిటం బతకలేం. పోనీ ఎటూ ఎల్లకుంట ఇంటికాడ కూకుండి పోయినా మనకేటీ జరగదని గేరంటీ ఏటి?

"ఆకులు సెట్టు నున్నందరికీ కాయలకోసం యిసిరిన రాళ్ల దెబ్బలు తినాల. ఆయింత నేలరాలీ పోతే ఏ గాలికో కొట్టుకెలిపోయి అగ్గిలోనో, బుగ్గిలోనో కలిసి పోక తప్పదు. బతుకూ అంతే.ఆయింత సావు ముంచుకొత్తే ఆ తరవాత ఏ పెమాదమూ వుండదు. అంతవరకీ పెమాదాల్తోటి పందెమేసి బతకడమే. పెమాదాల్తోటి నేస్తరికం కట్టీసి బతికీడిమే. పేదోడి బతుక్కి, పెమాదాలకి ఎప్పుడు జట్టే"




ఆల్బోసాంగ్‌తో శక్తి
ఆరోగ్యం, మరియు ఉల్లాసం

పెరిగే పాప ఎక్కువసేపు ఆడడానికి
తగిన శక్తి కలిగి ఉంది ఆ శక్తి రహస్యం?

ఆల్బోసాంగ్‌తో ఆరోగ్యం చేకూరుతుంది
అన్ని వయస్సులకు సరిపడే పౌష్టికాహారం ఉన్న టానిక్.
ఇందులోని ఖనిజాలు మరియు మూలికలు ఆహారానికి
అనుబంధంగా ఉపయోగపడతాయి.




ఇప్పుడు డబ్బాలలో
200 గ్రా &
400 గ్రా
ప్యాకింగ్‌లలో
లభించుచున్నది.

జె & జె డిషేన్
లేబరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్,
4-1-324, రెసిడెన్సీ రోడ్,
హైదరాబాద్-500 001, ఇండియా